ప్రజాశక్తి
బుధవారం 12 ఫిబ్రవరి 2025
5
విజయనగరం

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దారుణ హత్య

వినతుల పరిష్కారంలో జిల్లా టాప్

పిజిఆర్ఎస్‌లో జిల్లాకు రెండో స్థానం ● రెవెన్యూ వినతుల్లో 93.28 శాతం పరిష్కారం

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రజల సమస్యల పరిష్కారంలో జిల్లా అధికారులు చూపించిన కృషికి తగిన ఫలితం దక్కింది. రెవెన్యూకు సంబంధించిన సమస్యలతోపాటు, ఇతర గ్రీవెన్స్ సమస్యలను పరిష్కరించడంలో విజయనగరం జిల్లా రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచింది. పిజిఆర్ఎస్‌తో పాటు, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులపై జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశాల మేరకు, జిల్లా అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవడంతో రాష్ట్రస్థాయిలోనే మంచి గుర్తింపు లభించింది. ఫ్రీహోల్డ్ పట్టాల వెరిఫికేషన్ సైతం 99.49 శాతం పూర్తిచేసి ఇతర జిల్లాల కంటే ముందంజలో ఉంది. అలాగే ఫ్రీ హోల్డు డేటాను 99.17 రిజిస్టర్ చేసి ఆదర్శప్రాయంగా నిలిచింది. సిసిఎల్ఎ జయలక్ష్మి అమరావతి నుంచి మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ విషయాన్ని ప్రకటించారు వివిధ స్థాయిల్లో నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్ (ప్రజా వినతుల పరిష్కార వేదిక)కు వచ్చే వినతుల పరిష్కరంపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. కొన్ని జఠిల సమస్యల పరిష్కారానికి కలెక్టర్ స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి, సమస్య పరిష్కారానికి చొరవ చూపిస్తున్నారు. తమ పర్యటనల సందర్భంగా ప్రజల నుంచి వినతులను స్వీకరించి, అక్కడికక్కడే పరిష్కారం చూపిస్తున్నారు. దీంతో గ్రీవెన్స్ సమస్యల పరిష్కారంలో కూడా విజయనగరం జిల్లాలో అగ్రపథంలో ఉంది. గతేడాది జూన్ 15 నుంచి ఇప్పటివరకు జిల్లాలో పిజిఆర్ఎస్‌కు 21,318 వినతులు రాగా, వీటిలో 18,882 సమస్యలకు పరిష్కారం చూపడం ద్వారా 88.57 శాతంసాధించి రాష్ట్రంలోనే ద్వితీయ స్థానంలో నిలిచింది.

ఫిర్యాదుదారుల సంతృప్తే ముఖ్యం

ప్రజలనుంచి వచ్చే వినతుల పరిష్కారంలో అధికారులు మరింత శ్రద్ధ చూపించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోరారు. వచ్చిన ప్రతి వినతికీ నాణ్యతతో కూడిన పరిష్కారాన్ని చూపించాలని సూచించారు. సాధ్యమైనంతవరకు రీ ఓపెన్ అవ్వకుండా, ఫిర్యాదు దారుడిని సంతృప్తి పరచాలని చెప్పారు. ఫిర్యాదితో మాట్లాడి, వారి సమస్యను పూర్తిగా తెలుసుకొని, వారు శతశాతం సంతృప్తి చెందేలా పరిష్కరించాలని సూచించారు.

పెరిగిన మద్యం ధరలు

- బాటిల్‌పై పది రూపాయలు అదనం
- 99 చీప్ లిక్కర్, బీరు మినహా అన్నింటి ధరలూ పెంపు

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్రంలో మద్యం ధరలు పెరిగాయి. క్వార్టర్ రూ.99 బ్రాండ్లు మినహా అన్ని రకాల లిక్కర్ బ్రాండ్లకూ సీసాపై రూ.10 పెరిగింది. ఈమేరకు అదనపు రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ (ఎఆర్ఇటి)ను సవరిస్తూ ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎంకే మీనా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే బీరు ధరల్లో ఎలాంటి మార్పు లేదు. మార్జిన్ తక్కువ వస్తోందని లైసెన్సీలు గగ్గోలు పెట్టడంతో వారికిచ్చే మార్జిన్ పెంపునకు ఇటీవల కేబినెట్‌లో ప్రభుత్వం అంగీకారం తెలిపింది. అందుకు అనుగుణంగా ఎక్సైజ్ శాఖ పన్నుల్లో మార్పులు తీసుకొచ్చింది. అన్ని రకాల లిక్కర్ బ్రాండ్లపై లైసెన్సీలకు ఎఆర్ఇటి1లో మార్జిన్ లభిస్తుంది. దీని ఫలితంగా ఆ బ్రాండ్ల బాటిళ్లపై రూ.10 పెరిగింది. ఈ పెంపు తక్షణమే అమల్లోకి వచ్చింది. ఇప్పటికే ఉత్పత్తిచేసి గోడౌన్లలో ఉన్న, రవాణాలో ఉన్న మద్యానికి కూడా ఈ పెంపు వర్తిస్తుందని, ఆమేరకు లైసెన్సీలు అదనంగా చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. జిల్లాలో 153 మద్యం షాపులు, 28 బార్లు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా నెలకు 100 కోట్ల రూపాయలు మద్యం వ్యాపారం జరుగుతోంది. ధరల పెంపు మంగళవారం నుంచి అమల్లోకి రావడంతో మందుబాబులపై భారం పడింది. అడిషనల్ ఎక్సైజ్ ట్యాక్స్‌ను సవరించడంతో బాటిల్‌పై రూ.10చొప్పున పెరిగిందని ఎక్సైజ్ సూపరింటెండెంట్ బమ్మిడి శ్రీనాధుడు తెలిపారు. అమ్మకదారులకు నష్టం వాటిల్లుతుందని గ్రహించిన ప్రభుత్వం వారికి ఇస్తున్న 10 శాతం కమిషన్‌ను 14శాతానికి పెంచిందని తెలిపారు. 375 రకాల బ్రాండ్లపై పది రూపాయలు అదనం పెరిగిందని అన్నారు.

32 బెల్ట్ షాపులపై కేసులు : 174 లీటర్ల మద్యం సీజ్

మద్యం అక్రమంగా అమ్ముతున్న వారిపై గత మూడు రోజులుగా దాడులు నిర్వహించి కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ బమ్మిడి శ్రీనాధుడు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 9, 10,11 తేదీలలో అక్రమ మద్యమ దుకాణాలపై దాడులు నిర్వహించి 32 కేసులు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో 174.8 లీటర్ల మద్యం సీజ్ చేసినట్లు తెలిపారు ఇందులో 16 మందిని అరెస్టు చేసి వారిపై కేసులు నమోదు చేశామన్నారు. అక్రమ మద్యం వ్యాపారాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఆన్ లైన్ మోసాలపై అప్రమత్తం

జిల్లా ఇన్ఫర్మేటిక్స్ అధికారి నరేంద్ర

ప్రజాశక్తి- విజయనగరం కోట

ఆన్ లైన్ సేవలపై తగిన పరిజ్ఞానంతో అప్రమత్తంగా వుండటం ద్వారా మాత్రమే సైబర్ మోసాలకు గురికాకుండా సురక్షితంగా ఉండగలమని జిల్లా సూచన విజ్ఞాన అధికారి(డిస్ట్రిక్ట్ ఇన్‌ఫర్మేటిక్స్ అధికారి) ఆర్.నరేంద్ర అన్నారు. ఎలక్ట్రానిక్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ పరిధిలోని జాతీయ సూచన విజ్ఞాన కేంద్రం(నేషనల్ ఇన్‌ఫర్మేటిక్స్ సెంటర్) ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో మంగళవారం సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవం నిర్వహించారు. ప్రతి ఏటా ఫిబ్రవరి రెండో మంగళవారం సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవంగా (ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్) ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులకు అంతర్జాల సేవలను సురక్షితంగా ఎలా వినియోగించాలనే అంశంపై అవగాహన కల్పించారు. డిజిటల్ గుర్తింపును గానీ, వ్యక్తిగత సమాచారాన్ని అనధికారిక వెబ్‌సైట్లలో షేర్ చేయరాదని, ఒన్‌టైమ్ పాస్‌వర్డు సమాచారాన్ని ఇతరులతో పంచుకోరాదని చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో ఉచితంగా లభించే వైఫై వినియోగించడం వల్ల మన వ్యక్తిగత సమాచారం తస్కరించే ప్రమాదం వుందని తెలిపారు. తెలియని ఫోన్ నెంబర్ల నుంచి వీడియోకాల్స్ వచ్చినపుడు స్పందించరాదని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఎప్పటికప్పుడు డిజిటల్ సేవలపై అవగాహన పెంచుకుంటూ సైబర్ మోసాలకు గురికాకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు, సిపిఒ పి.బాలాజీ, జెఎన్‌టియు అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీకాంత్, ఇన్ఫర్మేటిక్స్ అధికారి ఎ.బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలి

పిఎఫ్ కార్యాలయం వద్ద పెన్షనర్ల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వివిధ పరిశ్రమల్లో పని చేసి రిటైర్డు అయిన కార్మికులకు కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలని కోరుతూ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పిఎఫ్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు .ధర్నాను ఉద్దేశించి సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 70లక్షల మంది వివిధ పరిశ్రమల్లో 25 నుంచి 30 ఏళ్ల పాటు సేవలు అందించిన కార్మికులకు కేవలం 1000 రూపాయిలు ఇస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇస్తున్న సామాజిక వృద్ధాప్య పింఛను రూ.4వేలు ప్రస్తుత పరిస్థితిలో అనేక ఏళ్లుగా వెయ్యి రూపాయిలు ఇవ్వడం ఎంత దారుణమన్నారు. దీంతో పాటు ఉచిత ఆసుపత్రి సేవలు రద్దు చేశారన్నారు. అదే విధంగా రైల్వేలో ఉచిత ప్రయాణం కూడా రద్దు చేశారన్నారు. లక్షలు రూపాయిలు పిఎఫ్, ఇఎస్ఐ ద్వారా దాచుకున్న డబ్బులకు కనీసం ఉచిత వైద్యం అందించకపోవడం ఎంతవరకు సమంజసమో మోడీ ప్రభుత్వం ఆలోచించాలన్నారు. అనేక ఏళ్లుగా పోరాటం చేస్తే కేంద్రం కమిటీ వేసిందని, రూ.4500 పెన్షన్ ఉండాలని సిఫార్సు చేసి మూడేళ్లు అయినా మోడీ ప్రభుత్వం దానిని అమలు చేయలేదన్నారు. వెంటనే పెరిగిన ధరలకు అనుగుణంగా 9 వేలు పెన్షన్ ఇవ్వాలని, ఉచిత రైల్వే ప్రయాణం, వైద్య సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో పెన్షన్‌దారులు అప్పలరాజు, శేషగిరి, అప్పన్నరెడ్డి, ఎం.పాపారావు, కిల్లంపల్లి రామారావు, ప్రకాశరావు, పెన్షన్ దారులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న పెన్షనర్లు

నూరుశాతం పన్నులు వసూలు చేయాలి : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆర్థిక సంవత్సరం ముగింపు సమీపిస్తున్న సమయంలో త్వరితగతిన పన్నులను రాబట్టి లక్ష్యాలను అధిగమించాలని రెవెన్యూ సిబ్బందికి, అడ్మిన్ కార్యదర్శులకు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. మంగళవారం తమ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వివిధ రకాల పన్నులు అన్నింటితో రూ.78 కోట్ల మేర డిమాండ్ ఉన్నదని, అందువల్ల ప్రతిరోజు లక్ష్యాలను విధించుకుని పన్ను వసూలను వేగవంతం చేయాలని ఆదేశించారు. లక్ష్యాలు చేరుకోలేని సిబ్బంది పట్ల కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు. సమావేశంలో ఎఒ సీతారామమూర్తి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, అడ్మిన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

ప్రజా సహకారంతోనే పార్కుల అభివృద్ధి

ప్రజల సహకారంతోనే పార్కులు అభివృద్ధి చెందుతాయని కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ప్రధాన రహదారులు, పార్కులను ఆయన పరిశీలించారు. రింగ్ రోడ్డు ప్రధాన రహదారిపై కొన్నిచోట్ల చెత్తాచెదారాలు ఉండడాన్ని గమనించి సిబ్బందిని మందలించారు. అనంతరం అక్కడ ఉన్న ఓ పార్కును పరిశీలించారు. అందరూ కలిసికట్టుగా పార్కును నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. నగరంలో ఉన్న అన్ని పార్కుల్లో ఇప్పటికే జంగిల్ క్లియరెన్స్ చేపట్టామని చెప్పారు. ప్రత్యేక జెసిబి, పనివారలతో కార్యాచరణ రూపొందించి పార్కులను పరిశుభ్రపరచామని చెప్పారు. అయితే ప్రజలు కూడా పార్కుల చుట్టుపక్కల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని, చెత్తాచెదారాలను పార్కుల్లో వేయరాదని సూచించారు. కమిషనర్ వెంట టిపిఒ అప్పలరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- మార్చి 17 నుండి 31 వరకు 10 వ తరగతి పరీక్షలు
- 119 కేంద్రాలు.. 23,765 మంది విద్యార్థులు
- ఎక్కడా కాపీయింగ్ జరగకుండా చర్యలు
- కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

మార్చి 17 నుండి 31 వరకు 10 వ తరగతి రెగ్యులర్ వారికీ , 17 నుండి మార్చి 28 వరకు ఓపెన్ స్కూల్స్ విద్యార్థులకు పరీక్షలు ఉదయం 9.30 నుండి 12.45 వరకు జరుగుతాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. రెగ్యులర్, ప్రైవేటు కలిపి జిల్లాలో 119 కేంద్రాల్లో 23,765 మంది విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. ఓపెన్ స్కూల్స్ నుండి రెగ్యులర్ 460 , ప్రైవేటు 154 మొత్తం 614 విద్యార్థులకు గానూ 27 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పది పరీక్షలపై కలెక్టర్ ఛాంబర్ లో ఏర్పాట్ల పై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేసారు. ప్రతి కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్ ను, డిపార్ట్మెంటల్ అధికారిని నియమించాలని, 7 ఫ్లయింగ్ స్కాడ్ లను ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలు చేయాలని, జెరాక్సు కేంద్రాలను, నెట్ సెంటర్లను మూసి వేయాలని తెలిపారు. ప్రశ్నా పత్రాలను నిల్వ ఉంచేందుకు విజయనగరం, గజపతినగరం చీపురుపల్లి, ఎస్.కోట పోలీస్ స్టేషన్లలో కస్టడీ ఏర్పాట్లను చేయాలన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

జిల్లా స్థాయిలో ఒక స్ట్రాంగ్ రూమ్ డిఆర్ఒ ఆధ్వర్యంలో ఉండాలని తెలిపారు. 9 రూట్ లను ఏర్పాటు చేసి ఇఒపిఆర్‌డి లేదా డిప్యూటీ తహశీల్దార్‌లను రూట్ ఆఫీసర్లు గా నియమించాలని తెలిపారు. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా పరీక్షల సమయంలో అవసరమగు బస్సులను నడపాలని ఆర్‌టిసి అధికారులకు తెలిపారు. పరీక్షల పర్యవేక్షణ కు మండల స్థాయి లో నున్న గజెటెడ్ అధికారులను వేయాలని, అన్ని కేంద్రాలను ప్రతి రోజు సందర్శించి, ప్రశాంతంగా పరీక్షలు జరిగేలా ప్రతి ఒక్కరూ చూడాలని ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఒ శ్రీనివాస మూర్తి, డిఇఒ మాణిక్యం నాయుడు, డిఎంహెచ్ఒ డాక్టర్ జీవనరాణి, ఆర్‌టిసి, పోలీస్, విద్యుత్ శాఖల అధికారులు, ఆర్ఐఒ, పోస్టల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జెఇఇ మెయిన్స్‌లో ర్యాంకుల పంట

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు ర్యాంకులు సాధించారు. తోటపాలెంలోని శ్రీచైతన్యకళాశాలకు చెందిన బలగ జయేంద్రనాయుడు 99.849పర్సంటేల్ సాధించాడు. అదే కళాశాలకు చెందిన దాసరి మోక్షజ్ఞ 97.93, మజ్జి జ్ఞాన హాసిని 97.89 పర్సంటేల్ సాధించారు.

ఆశిష్‌కు 1582 వ ర్యాంకు

మెరకముడిదాం : మండలంలోని బిల్లల వలస విద్యార్థి కందుకూరి ఆశీష్ ఆలిండియాలో 1582వ ర్యాంకు సాధించాడు. ఆయన తండ్రి రవికుమార్ మెరకముడిదాం పిహెచ్‌సిలో విధులు నిర్వహిస్తున్నారు. ర్యాంకు సాధించడం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థుల ఆరోగ్యమే ప్రగతి

ప్రజాశక్తి-విజయనగరం కోట

విద్యార్థుల ఆరోగ్యంపైనే విద్యా ప్రగతి ఆధారపడి ఉంటుందని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ కొండపల్లి సాంబమూర్తి పేర్కొన్నారు. మంగళవారం పువ్వాడ స్కూలులో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ మంచు కుమారస్వామి మాట్లాడుతూ పిల్లలు ఎక్కువగా సెల్‌ఫోన్ వినియోగం వల్ల, సూర్యరశ్మి శరీరానికి అవసరమైన మేరకు తగలక పోవడం వల్ల, ఎక్కువగా ఆటలు ఆడక పోవడం వల్ల, ఎ విటమిన్ కలిగిన ఆహార పదార్థాలను తగినంతగా తీసుకోకపోవడం, వల్ల కంటి సమస్యలు ఏర్పడుతున్నాయని వివరించారు. కంటి సమస్యలు వచ్చినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా అందుబాటులో ఉన్న వైద్య నిపుణులను సంప్రదించి తగిన చికిత్స తీసుకోవాలని సూచించారు.

మార్చిలోగా పనులు పూర్తి చేయాలి

మత్స్యశాఖకు మంజూరైన నిధులతో జెట్టీల నిర్మాణం చేపట్టాలి

కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశాలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో జాతీయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డు) ఆర్థిక సహాయంతో గ్రామీణ మౌళిక సదుపాయాల అభివృద్ధి నిధి (ఆర్ఐడిఎఫ్) కింద ప్రాజెక్టులు చేపట్టిన ప్రభుత్వ శాఖలు ఆయా పనులను త్వరగా పూర్తిచేసి సంబంధిత పనులపై నివేదికలను నబార్డు అధికారులకు వెంటనే అందజేయాలని జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆదేశించారు. ఆయా పనులపై బ్యాంకు అధికారులు, సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులతో మంగళవారం కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో పది ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో రూ.926.60 కోట్ల అంచనా వ్యయంతో 203 ప్రాజెక్టులను చేపట్టగా, వీటిలో నాబార్డు నుంచి ఆర్ఐడిఎఫ్. కింద రూ.636.35 కోట్ల నిధులను కేటాయించినట్లు నాబార్డు ఎజిఎం నాగార్జున తెలిపారు. ఇందులో రూ.423.06 కోట్లు ఆయా ప్రభుత్వ శాఖలు ఖర్చు చేశాయని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖలు నాబార్డు నిధులతో చేపట్టిన రోడ్లు, స్కూలు భవనాలు, ఆసుపత్రులు, అంగన్ వాడీ భవనాలు, అగ్రిల్యాబ్‌లు తదితర మౌళిక వసతుల ప్రాజెక్టులు, వాటి ప్రస్తుత స్థితిపై కలెక్టర్ సమీక్షించారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో రూ,25.65 లక్షలతో పనులు మంజూరైనప్పటికీ చేపట్టనందున ఆ నిధులను వినియోగించి పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో మత్స్యకారులకు ఉపయోగపడే విధంగా రెండు ఫిషింగ్ జెట్టీల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని మత్స్యశాఖ డి.డి. నిర్మలాకుమారి, విద్య, సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ అధికారి డివిఎన్ మూర్తిలను ఆదేశించారు. బి.సి.రెసిడెన్షియల్ స్కూల్ భవనాల నిర్మాణం పూర్తయినప్పటికీ బిల్లులు చెల్లించలేదని సంక్షేమ ఇంజినీరింగ్ విభాగం ఇఇ తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లా నియోజకవర్గ స్థాయిల్లో ఏడు ల్యాబ్ ల నిర్మాణం పోలీసు, గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టగా జిల్లా స్థాయి ల్యాబ్ మినహా మిగిలిన పనులన్నీ పూర్తి చేశామని వ్యవసాయశాఖ జెడి వి.టి.రామారావు తెలిపారు. వేపాడ మండలంలో సోంపురం-అతవ రోడ్డు పనిని మార్చి 15లోగా పూర్తిచేసి కాంట్రాక్టరుకు బిల్లు చెల్లించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో గ్రామీణ నీటిసరఫరా ఎస్ఇ కవిత, సమగ్రశిక్ష, మహిళాశిశు అభివృద్ధి శాఖ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు



రహదారి భద్రతా నియమాలు పాటించాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

వాహనాలను నడిపే డ్రైవర్లు తప్పనిసరిగా రహదారి భద్రత నియమాలు పాటిస్తూ నడిపే ప్రతి డ్రైవర్ తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ వాహనాలు నడపాలని ప్రజా రవాణా అధికారి సిహెచ్. అప్పలనారాయణ అన్నారు. మంగళవారం ఆర్‌టిసి డిపోలో రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా రోడ్డు భద్రత ర్యాలీని డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆర్‌టిసి కాంప్లెక్సు నుంచి తిరుమల ఆస్పత్రి జంక్షన్, అక్కడి నుంచి మయూరిజంక్షన్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిపిటిఒ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్నప్పుడు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ ప్రమాదాలు తెచ్చుకోవద్దని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలో పాటించి బాధ్యత గల పౌరులుగా ప్రతి ఒక్కరు మెలుసు కోవాలన్నారు. శృతి మించిన వేగంతో ప్రయాణం చేయొద్దన్నారు. కార్యక్రమంలో ఆర్‌టిసి విజయనగరం ట్రాఫిక్ ఎస్ఐ కె.చంద్ర మధు, ఎఎస్ఐ రంగారావు, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

డిపిఒను కలిసిన పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గం

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా పంచాయతీ అధికారి ఎన్. వెంకటేశ్వరరావును, డిప్యూటీ సిఇఒ ఆర్.వెంకటరామన్‌ను జిల్లా పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గం మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలు పరిష్కరించాలని నాయకులు కోరారు. గ్రేడ్ డివియేషన్ ఉన్న కార్యదర్శుల జీతాలు చెల్లించాలని, 6ఏళ్ల ఇంక్రిమెంట్లు అర్హత ఉ్న కార్యదర్శులకు మంజూరు ఉత్తర్వులు ఇవ్వాలని, గ్రేడ్ -5,4,3 వారికి ప్రమోషన్‌లు ఇవ్వాలని కోరారు. స్పందించిన డిపిఒ సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు వై. రమణ, కార్యదర్శి పార్ధసారధి, ట్రెజరర్ టి. వెంకటరావు, ఉపాధ్యక్షులు ఎమ్. జగదీశ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సిహెచ్ ప్రసాద్, జి.కుమారి, ఎపిఎన్‌జిఒ జిల్లా ఉపాధ్యక్షులు ఎల్.తౌడు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుశాఖ ప్రతిష్టను పెంచాలి

నేర సమీక్షలో ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రజలతో మంచిగా ప్రవర్తించి పోలీసుశాఖ ప్రతిష్టను పెంచాలని ఎస్‌పి వకుల్ జిందాల్ పోలీసు అధికారులకు సూచించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలీసు స్టేషనుకు వచ్చే బాధితులతో మర్యాదగా ప్రవర్తించాలని, వారు స్టేషనుకు ఏ కారణం తో వచ్చింది తెలుసుకొని, వారు చెప్పే విషయాలను శ్రద్ధగా విని, పరిష్కార మార్గాలను చూపాలని, ఫిర్యాదులను స్వీకరించాలని సూచించారు. విజిబుల్ పోలీసింగులో భాగంగా ప్రజలు ఎక్కువగా ఉండే ప్రాంతాలను సందర్శించాలని, రాత్రి పెట్రోలింగు సమయంలో విధిగా లారీ, విజిల్, టార్చిలైటుతో పాటు, వాహనానికి పోలీసు సైరన్ ఉండాలన్నారు. రాత్రి సమయాల్లో అనుమానస్పదంగా సంచరించే వ్యక్తుల వేలిముద్రలను తనిఖీ చేయాలని, పోలీసు స్టేషన్లు, సర్కిల్ కార్యాలయాలకు అందజేసిన ఎఫ్‌పిబి చెక్ డివైజ్లను వినియోగించాలని అధికారులను ఆదేశించారు. ఎటిఎంలు, బ్యాంకులో చోరీలు జరగకుండా రాత్రి పెట్రోలింగు, గస్తీ నిర్వహించే సమయంలో వాటిని విధిగా సందర్శించి, భద్రతను పర్యవేక్షించి, సెక్యూరిటీ గార్డులను అప్రమత్తం చేయాలన్నారు. దత్తత కానిస్టేబుళ్ళు, ఎస్ఐలు, సిఐలు, డిఎస్‌పిలుగా వారి పరిధిలోని గ్రామాలను సందర్శించి, గ్రామస్థులతో మమేకం కావాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అంశాలను గుర్తించి, పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. మహిళా పోలీసులు (ఎం.ఎస్.పి)లతో ప్రతీ వారం సమావేశం నిర్వహించాలని, వారి పరిధిలో గ్రామాలు/వార్డుల్లో శాంతిభద్రతల సమస్యలను, పాత నేరస్థుల ప్రవర్తన, కొత్త వ్యక్తుల గురించిన సమాచారాన్ని తెలుసు కోవాలన్నారు. డయల్ 100/112 కాల్స్ కు అధిక ప్రాధాన్యతను ఇవ్వాలని, సమాచారం అందుకున్న వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని, సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రసల్ ఫిర్యాదులను నిర్దిష్ట సమయంలో విచారణ పూర్తి చేయాలని, వారి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. మార్చిలో జరిగే లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు డిస్పోజ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి, చోరీలు నియంత్రించుటలోను, లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులను డిస్పోజ్ చేయడంలోను, దర్యాప్తు కేసులను తగ్గించడంలోను, నిందితులకు న్యాయస్థానంలో శిక్ష పడే విధంగా చేయడంలో ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్‌పి అభినందించారు. సమావేశంలో అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, డిఎస్‌పిలు ఎం.శ్రీనివాసరావు, జి.భవ్యరెడ్డి, ఎస్.రాఘువులు, ఎం.వీరకుమార్, పలువురు సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి వకుల్ జిందాల్

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - రామభద్రపురం

గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి జోగు లక్ష్మీ తెలిపారు. మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. పెన్ పనులు వేగవంతం చేయాలని సూచించారు. గ్రంథాలయానికి ప్రహరీ లేకపోవడంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ పనితీరును మెచ్చుకున్నారు. ఈ తనిఖీల్లో స్థానిక గ్రంథాలయాధికారి సత్యవాణి పాల్గొన్నారు.

వసతి గృహం పరిశీలన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బక్కునా యుడుపేట ఎపిఎస్‌డబ్ల్యుఆర్ఎస్ బాలికల వసతిగృహాన్ని మండల విద్యాశాఖ అధికారులు బాలసుబ్రమణ్యం, నాగభూషణం మంగళవారం పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులు శతశాతం సాధించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి - జామి

మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు, ఎజెన్సీ బిల్లులు తక్షణమే విడుదల చేయాలని ఎఐటియుసి నాయకులు దేగల అప్పలరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన చేపట్టి, అనంతరం తహశీల్దార్ కృష్ణలతకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, మిడ్ డే మీల్ కార్మికులకు పెండింగ్ బిల్లులు, రెండు నెలలుగా బకాయి పడ్డ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అప్పులు చేసి పిల్లలకి భోజనాలు పెడుతున్న తీరును అధికారులకు వివరించారు. అనంతరం ఎంపిడిఒ అప్పలనాయుడు, ఎంఇఒ జయశ్రీకు వినతులు అందజేశారు. కార్యక్రమంలో రమణమ్మ, రామలక్ష్మి మహిళా కార్మికులు పాల్గొన్నారు.

సీత గుండం యాత్రకు సిద్ధం

ప్రజాశక్తి - రామభద్రపురం

మండలంలోని పాడివానివలస గ్రామ సమీపాన పర్వత శ్రేణుల మధ్య వెలసిన సీతారాముల ఆలయం వద్ద బుధవారం సీత గుండం యాత్ర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. ఏటా మాఘశుద్ధ పౌర్ణమి నాడు ఇక్కడ సీత గుండం యాత్ర నిర్వహించడం ఆనవాయితీ. దశాబ్దాల కాలంగా ఈ పర్వత శ్రేణుల మధ్య వెలసిన సీతారాములకు పెద్ద ఎత్తున పూజలు చేస్తారు.

హ్యూమన్ రైట్స్ ఇన్‌ఛార్జిగా అచ్చయ్యనాయుడు

ప్రజాశక్తి - గజపతినగరం

గజపతినగరానికి చెందిన సామిరెడ్డి అచ్చయ్యనాయుడును ఉత్తరాంధ్ర హ్యూమన్ రైట్స్ ఇన్చార్జిగా నియమించారు. ఇండో హ్యూమన్ రైట్స్ కేర్ జాతీయ సంస్థ చైర్మన్ ఈ మేరకు తన నియామక ఉత్తర్వులు జారీచేసినట్లు అచ్చయ్యనాయుడు మంగళవారం తెలిపారు. ఈ సంస్థ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో పనిచేస్తుందని చెప్పారు. అచ్చయ్య నాయుడు గతేడిన పార్లమెంటు ఎన్నికల్లో సమాజ్‌వాది పార్టీ అభ్యర్థిగా విజయనగరం పార్లమెంట్ నుంచి పోటీ చేశారు. తనపై నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని, ఈ సందర్భంగా సంస్థ చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు పరీక్షా కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - శృంగవరపుకోట

ఆర్యవైశ్య యువజన సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని వెంకటరమణ పేట గ్రామంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు పరీక్షకు సంబంధించిన పరీక్ష కిట్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పప్పల్లకుల ఈశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలని, పాఠశాలకు గురువులకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యులు, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు హెచ్ నానాజీ, జిల్లా జాయింట్ సెక్రెటరీ బాలాజీ శ్రీనివాస్, మండల కార్యదర్శి పూసర్ల రవికుమార్, వాసవి క్లబ్ ప్రతినిధులు జిల్లా గవర్నర్ కుసుమంచి వెంకటేశ్వరావు, యూత్ ఎస్‌కోట కార్యదర్శి సురేష్ కుమార్, మెగా ఎస్.కోట అధ్యక్షులు పి అప్పారావు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి - తెర్లాం

మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దివ్యభారతి ప్రజలని మాట్లాడారు. మానవ శరీర అవయవాల్లో కంటి దృష్టి ప్రధానమైనదని, ప్రతి ఒక్కరూ కంటి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని కోరారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ విజయనగరం సౌజన్యంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, తెర్లాం ఆవరణలో నిర్వహించిన నేత్ర శిబిరంలో 40 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ, ప్రస్తుతం గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది నిర్వహిస్తున్న సర్వే 3.0లో ఉన్నటువంటి కంటి పరీక్షలు చేసుకొని, దృష్టి సమస్య ఉన్నవారు, హెల్త్ వెల్నెస్ కేంద్రంలో తమ పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో 19 మందికి, సమగ్ర పరీక్షలు, శస్త్ర చికిత్స కోసం విజయనగరం పుష్పగిరి కంటి ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు తెలిపారు. అనంతరం ఉన్నత వైద్య విద్య కోసం వెళ్తున్న వైద్యాధికారిణి డాక్టర్ డి.దివ్యభారతి ప్రభావతి జాగృతి ట్రస్ట్ వ్యవస్థాపకులు, ఆప్తాల్మిక్ ఆఫీసర్ రౌతు ఎస్. వసంతరావు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సామాజిక ఆరోగ్య అధికారి బి. భాస్కరరావు, సూపర్‌వైజర్ పి.గోపాలనాయుడు, జి.రాధాయ్య, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపిడిఒ కె.రామకృష్ణరాజు అన్నారు. మంగళవారం రామతీర్థం, తంగుడుబిల్లి సచివాలయాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో రికార్డులు పరిశీలించి హౌసింగ్ జియో ట్యాగింగ్, మిస్సింగ్ సిటిజన్ త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సిబ్బంది అర్జీదారుల మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాన్ని సందర్శించిన ఎంపిడిఒ

రాజాం: మండలంలోని గురవాం గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఎంపిడిఒ శ్రీనివాసరావు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ రోజు ఉదయం టైం కి విధులకే హాజరై జిఎస్‌డబ్ల్యుఎస్ యాప్‌లో ఉదయం సాయంత్రం హాజరు నమోదు చేయాలని సిబ్బందిని సూచించారు. పలు రికార్డులను, రిజిస్టర్లను పరిశీలించారు. ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సచివాలయంలో పెండింగ్‌ ఉన్న 110 హౌస్ హోల్డ్ జియో సర్వే, మిస్సింగ్ సిటిజన్ డేటా ఎంట్రీ త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. వేసవిలో తాగునీటి ఇబ్బంది తలెత్తకుండా చూడాలని సూచించారు.

పల్లె పండగ పనులు పరిశీలన

ప్రజాశక్తి - తెర్లాం

మండలంలోని వెలగవలస, పెరుమాలి గ్రామాల్లో జరుగుతున్న పల్లె పండగ పనులను మంగళవారం ఇఇ బిటి రమణమూర్తి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొబ్బిలి, రాజాం, గజపతినగరం డివిజన్‌లలో జరుగుతున్న పల్లె పండగ పనులకు రూ. 78 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. ఇందులో రూ.9 కోట్ల వరకు పేమెంట్ కూడా చేశామన్నారు. ఇప్పటివరకు జరిగిన పనుల్లో నాణ్యత ప్రమాణాలు బాగున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన బిల్లులు ఈ నెల 15వ తారీకు లోపు బిల్లులు అప్‌లోడ్ చేయాలని తెలియజేశారు.

అంగన్వాడీ చిన్నారులకు వితరణ

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని ముక్కాం -2 అంగన్వాడీ కేంద్రానికి దాతలు స్టీల్ కంచాలు, గ్లాసులు మంగళవారం అందజేశారు. గ్రామానికి చెందిన కోణాల మహేష్ కుమార్, నవ్య బాను దంపతుల కుమారుడి పుట్టినరోజు సందర్భంగా అంగన్వాడీ విద్యార్థులకు వీటిని ఐసిడిఎస్ కార్యాలయంలో ఎసిడిపిఒ సత్యవతి చేతుల మీదుగా అందజేశారు. అంగన్వాడీ టీచర్ కొర్లమ్మ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

టిడిపిలో పలు కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి - బొబ్బిలి

మండలంలోని రాముడువలస గ్రామ ఎస్‌సి కాలనీకి చెందిన 60 కుటుంబాలు మంగళవారం వైసిపిని వీడి టిడిపిలో చేరాయి. బొబ్బిలి కోటలో చింతాడ జయప్రదీప్ కుమార్, ధమిని డేవిడ్ ఆధ్వర్యంలో వీరందరికీ ఎమ్మెల్యే బేబినాయన కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

గోపాల మిత్రే అక్కడ పశువైద్యాధికారి

- కనిపించని డిప్యుటేషన్‌పై వచ్చిన వైద్యులు
- ఇబ్బందులు పడుతున్న పాడి రైతులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

ప్రజాశక్తి - డెంకాడ

పాడి రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని వారికి ఎటువంటి పశునష్టమూ జరగకుండా చూస్తామని ప్రభుత్వం ఒక వైపు చెబుతూనే ఉన్నప్పటికీ క్షేత్ర స్థాయిలో అధికారులు ఆ దిశగా అడుగులు వేయడం లేదు. ప్రభుత్వ విధానాలను వైద్యులు కనీసం లెక్కచేయకుండా వారికి నచ్చినట్లు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా పాడి పశువులకు సకాలంలో వైద్యం అందక పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఇబ్బందులకు నాతవలస పశువైద్య కేంద్రం తార్కాణంగా నిలుస్తోంది. ఇక్కడ పనిచేసిన విఎల్ఒ ఆరు నెలల క్రితం రిటైర్ అవ్వడం వల్ల ఆమె స్థానంలో వేరొకరిని డెప్యూటేషన్ పై నియమించారు. కానీ ఈ ఆరు నెలల కాలంలో ఒక్కరోజు కూడా ఆ వ్యక్తి ఆస్పత్రికి రాలేదంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చును.

మండలంలోని నాతవలస పశు వైద్య కేంద్రంలో గోపాలమిత్రే పశువైద్యాధికారి అవతారమెత్తి పశువులకు వైద్యం చేస్తున్నారు. ఇక్కడకు డెప్యూటేషన్‌పై భోగాపురం నుంచి ఎల్ఎస్ఒగా పద్మను నియమించారు. భోగాపురంలో మూడు రోజులు, నాతవలసలో మూడు రోజులు విధులు నిర్వహించాలని అధికారులకు ఆమెకు చెప్పారు. కానీ ఇక్కడకు ఒక రోజు కూడా వైద్యం అందించడానికి ఆమె రాలేదు. దీంతో పాడి రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ పశువైద్య కేంద్రానికి నాతవలసతో పాటు సింగవరం, మహంతి పేట, లంకపేట, కొప్పెర్ల గ్రామాలకు చెందిన రైతులు తమ పశువులను తీసుకువచ్చి వైద్యం చేయించుకుంటారు ఈ గ్రామాల్లో గొర్రెలు, మేకలు ఎక్కువగా ఉన్నాయి. వాటికి ఎప్పటికప్పుడు జబ్బులు వస్తుంటాయి. వాటిని కూడా వైద్యం అందించే నాథుడే కరువయ్యాడు. ఇక్కడ వైద్యాధికారి లేకపోవడంతో డెంకాడ గాని భోగాపురం గాని పశువులను తీసుకెళ్లవలసి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు నిత్యం పశువులతో కనిపించిన పశువైద్య కేంద్రం వైద్యాధికారి లేకపోవడంతో వెలవెలబోతుంది. ఈ ఆసుపత్రి భవనం కూడా శిథిలావస్థకు రావడంతో ప్రభుత్వం కొత్త భవనం మంజూరు చేసింది.



రికార్డులు సిద్ధం చేస్తున్న గోపాలమిత్ర

అన్నీ తానై..

ఈ కేంద్రంలో గోపాలమిత్రగా పూసపాటిరేగ మండలం కుమిలి గ్రామానికి చెందిన జి.సత్యనారాయణ పనిచేస్తున్నాడు. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో అంతా తానై వ్యవహరించి పశువులకు వైద్యం అందిస్తున్నాడు. ఇతనికి 6,500 రూపాయలు నెలకు ప్రభుత్వం ఇస్తుంది. అయితే ఆరు నెలలకు ఒకసారి ఈ జీతం వస్తుందని గోపాలమిత్ర తెలిపాడు. ఈ డబ్బులతో ఉదయం 9 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఇక్కడ పని చేయవలసి వస్తుందని ఆయన వాపోయాడు. ఈ పశువైద్య కేంద్రానికి నిత్యం పశువులు, గొర్రెలు, మేకలను రైతులు వైద్యం కోసం తీసుకువస్తూనే ఉంటారని, ఇప్పటికైనా అధికారులు ఈ పశువైద్య కేంద్రానికి పూర్తిస్థాయి వైద్యాధికారిని నియమించాలని ఈ ప్రాంత పాడి రైతులు కోరుతున్నారు.

ఆస్పత్రి రికార్డులను పరిశీలిస్తున్న దామోదర్

అధికారులు వచ్చేసరికి ప్రత్యక్షం

నాతవలస గ్రామీణ పశువైద్యశాలను విజయనగరం పశు సంవర్థక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ దామోదర్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ముందే సమాచారం తెలుసుకున్న ఎల్ఎస్ఒ పద్మ ఆయన పశువైద్య కేంద్రానికి వచ్చేసరికి అక్కడ ప్రత్యక్షమై రికార్డులన్నీ సర్దుబాటు చేసి తాను నిత్యం ఇక్కడ అందుబాటులో ఉంటున్నట్లు అధికారులకు చెప్పింది. పశువులకు వైద్యం అందిస్తున్నట్లు కూడా రికార్డులను చూపించి నమ్మబలికింది. అయితే వాస్తవానికి ఆమె ద్వారా పశువులకు ఇక్కడ వైద్యం అందడం లేదని, గోపాల మిత్ర ద్వారానే మాత్రమే పశువులకు వైద్యం అందుతుందని గమనించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఆయన వెంట భోగాపురం సహాయ సంచా లకులు డాక్టర్ ఉమాశంకర్ మహాపాత్రో, డెంకాడ పశువైద్యులు డాక్టర్ కె సంతోష్ కుమార్ తదితరులు ఉన్నారు.

చెరువులో చేపలు విడుదల

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని పాటూరు గ్రామానికి చెందిన ఓబల రాయుడు చెరువు, రాజు చెరువులలో మంగళవారం ప్రధానమంత్రి మత్స్య సంపద పథకంలో భాగంగా ఎంపిడిఒ సూర్యనారాయణ 2వేల చేప పిల్లలను విడిచి పెట్టారు. ఈ చేప పిల్లల పెంపకం వల్ల పంచాయతీకి మంచి ఆదాయం వచ్చే అవకాశాలు ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనిల్ కుమార్, ఎ. విజయలక్ష్మి, విలేజ్ సెషనరీ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ పరీక్షలో ప్రతిభ

ప్రజాశక్తి- డెంకాడ

రాష్ట్ర స్థాయి ఎడ్యుకేషనల్ ఎంపిసీ మెరిట్ టెస్ట్ (ఇఇఎమ్‌టి) ఆన్ లైన్ పరీక్షలో మండలంలోని పెదతాడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థి తిప్పాన విద్యశ్రీ ప్రథమ ర్యాంకు సాధించింది. ఇటీవల అమరావతిలో జరిగిన రాష్ట్ర స్థాయి బహుమతి ప్రధానోత్సవంలో ముఖ్యఅతిథిగా హాజరైన డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషనల్ వి.రామరాజు చేతుల మీదగా ప్రశంస పత్రం రూ.5వేలు నగదు, జ్ఞాపకను విద్యశ్రీ అందుకున్నారు. ఈ సందర్భంగా బాలికను డిఇఒ యు. మాణిక్యం నాయుడు, డిప్యూటీ డిఇఒ కెవి రమణ, ప్రధానోపా ధ్యాయులు వివిఎ నర్సింగరావు, ఇఇఎమ్‌టి జిల్లా కోఆర్డినేటర్ వి. రాజేష్, క్లాస్ టీచర్ జి పద్మావతి, పాఠశాల చైర్మన్ దంతులూరి చిరంజీవి రాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉపాధి పనులు పరిశీలించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలో ముకుందపురం, ఓబలయ్యపాలెం, బొద్దాం, పాటూరు, కేజీ పూడి, వావిలపాడు, వల్లంపూడి, వేపాడ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు పూటలా పనిచేస్తేనే కూలీ గిట్టుబాటవుతోందన్నారు. ఆయన వెంట ఎపిఒ ఆదిలక్ష్మి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సచివాలయంలో ఆకస్మిక తనిఖీ

మండలంలోని బొద్దాం సచివాలయంలో ఎంపిడిఒ ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టిక ద్వారా వారి పేర్లు పిలిచి వారి విధులు ఏ విధంగా జరుగుతున్నాయి? ఏఏ పనులు శాఖా పరంగా పెండింగ్‌లో ఉన్నాయో వాటికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి మంచి ఆదాయం వచ్చే వనరులు ఉన్నందున గ్రామాన్ని ఆదర్శంగా తీర్చి దిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కాకర భారతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మెరకముడిదాం: ఉపాధి వేతనాదారులకు రోజుకు గరిష్ట వేతనం రూ.300లకు తగ్గకుండా చూడాలని ఎంపిడిఒ భాస్కరరావు అన్నారు. మంగళవారం కొర్లామ్ పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రస్తుతం 4500 మంది వేతనదారులు ఉపాధి పనులలో పాల్గొంటున్నారని, వేతనదారుల సంఖ్యను ఆరువేల మందికి తగ్గకుండా చూడాలన్నారు. కొర్లామ్ మాదిరిగా పనిచేసే చోట కూలీలకు నీడ, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు.

వేపాడ: రికార్డులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ సూర్యనారాయణ

గిరిజన గ్రామాలను షెడ్యూల్డ్ ఏరియాలో చేర్చాలి

ప్రజాశక్తి- మెంటాడ

గిరిజన గ్రామాలను షెడ్యూల్డ్ ఏరియాలో చేర్చాలని కోరతుఊ ఆంధ్ర సచివాలయం వద్ద మంగళవారం వ్యవ సాయ కార్మిక సంఘం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజనులు ధర్నా చేప ట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం సహాయ కార్యదర్శి రాకోటి రాములు మాట్లాడుతూ గిరిజన గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో చేర్చి మౌలిక సదుపా యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. స్పీకర్ అయ్యన్న పాత్రుడు 1/70 చట్టాన్ని సవరించాలని చెప్పిన మాటలను వెనక్కి తీసుకోవాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఖనిజసంపద భూములకు రక్షణ కల్పించాలన్నారు. గిరిజన గ్రామాల్లో సాగు చేస్తున్న భూములు అడవ పోడు, బంజరు భూములకు భూహక్కు పత్రాలు మంజూరు చేయాలన్నారు. అటవి హక్కుల చట్టాన్ని జిఒ నెంబర్ 3ని అమలు చేయాలన్నారు. ఆంధ్ర ప్రాజెక్టు గిరిజన నిర్వాసితులకు చేపలు సోసైటీ ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలని, ప్రాజెక్టులో చేప పిల్లలు విడుదల చేసి గిరిజనులను ఆదుకోవాలని, గ్రామ సచివాలయం ద్వారా చేపల వేలం పాట నిలుపుదల చేయాలని కోరారు. గిరిజనులు పండించిన అటవీ ఉత్పత్తులను జిసిసి ద్వారా కొనుగోలు చేయాలన్నారు. గిరిజన యూనివర్సిటీలో 50 శాతం గిరిజనులకు అవకాశం కల్పించాలన్నారు. మండల తహశీల్దార్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లాసహాయ కార్యదర్శి తామరపల్లి సోములు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న గిరిజనులు

ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల కన్నీళ్లు తుడవండి

ప్రజాశక్తి- బొబ్బిలి

ఉత్తరాంధ్రలోని పలు సాగునీటి ప్రాజెక్టుల పనులు పూర్తికాక కన్నీరు పెడుతున్నాయని ఆయా ప్రాజెక్టుల కన్నీళ్లు తుడవాలని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మరిశర్ల మాలతి కృష్ణమూర్తి నాయుడు కోరారు. విజయవాడలో రాయలసీమ సాగునీటి సాధన సమితి, ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి సదస్సులో ఆయన ఉత్తరాంధ్ర తరఫున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రాలో మిగతా ప్రాంతాల కంటే ఉత్తరాంధ్ర బాగా వెనుకబడి ఉందన్నారు. దానికి ప్రత్యేక కారణం సాగునీటి ప్రాజెక్టులు పూర్తి కాకపోవడమే అని గుర్తు చేశారు. ప్రాజెక్టులు పూర్తికాక, వ్యవసాయానికి సాగునీరు అందక, రైతులు వర్షాలపై ఆధారపడి పంటలు పండించుకోలేక వలస బాట పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాగవలి, వంశధార నదుల అనుసంధానంతో పాటు జంఝావతి, అడారుగెడ్డ, గుమ్మిడి గెడ్డ వనకాబడిగెడ్డ తదితర ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. సకాలంలో రైతులకు సాగునీరందక వ్యవసాయం చేసేందుకు రైతులు భయపడుతున్నారన్నారు. వర్షాధారంగా చేస్తున్నప్పటికీ సాగునీరందక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అనంతరం రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తదితరులకు వినతి పత్రాన్ని అందజేశారు.

గ్రామాల్లో ఆర్‌డిఒ పర్యటన

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని వివిధ సమస్యలపై ఆర్‌డిఒ దాట్ల కీర్తి మంగళవారం పలు గ్రామాల్లో పర్యటించారు. భీమిలి మండలం అన్నవరం రెవెన్యూలో నిర్మిస్తున్న ఓబరేయ్ హోటల్‌కు నిర్మాణ సామాగ్రి వెళ్లేందుకు తమ భూముల్లో నుంచి వెళ్లకుండా కంచేరు రెవెన్యూ పరిధిలోని రైతులు అడ్డుకున్నారు. ఈ రైతులకు ఆర్‌డిఒ నచ్చజెప్పి వాహనాలు వెళ్లే విధంగా వారితో మాట్లాడారు. బైరెడ్డిపాలెం గ్రామంలో అప్రోచ్ రోడ్డు నిర్మాణంలో పాఠశాల తొలగించాల్సి వచ్చింది. పాఠశాలను కొత్తగా నిర్మించడానికి స్థలాన్ని పరిశీలించాలని సర్వే శాఖ అధికారులకు సూచించారు. విమానాశ్రయంలో మూడు గ్రామదేవతల ఆలయాలు పోవడంతో వాటిని కొత్తగా నిర్మించేందుకు స్థలాన్ని కూడా సేకరించాలని ఆర్‌డిఒ ఆదేశించారు. తహశీల్దార్ ఎం.సురేష్, విఆర్ఒ కె.నారాయణస్వామి నాయుడు, సచివాలయ సర్వేయర్ కిరణ్, గ్రామస్తులు బైరెడ్డి యర్రప్పల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత ప్రభుత్వ స్థలాలను రెగ్యులరైజ్ చేస్తాం: ఆర్‌డిఒ

రామభద్రపురం: ప్రయివేటు వ్యక్తుల ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ స్థలాలను రెగ్యులరైజ్ చేస్తామని బొబ్బిలి ఆర్‌డిఒ రామ్మోహనరావు తెలిపారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 150 గజాల స్థలం వరకు ఉచితంగా రెగ్యులరైజ్ చేస్తామని, 150 గజాలు దాటిన స్థలాలకు కొంత రుసుం చెల్లించి రెగ్యులర్ చేసుకోవాలని సూచించారు. ఇటీవల రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన 6,903 ఫిర్యాదులకు గానూ సుమారు 6037 ఫిర్యాదులు పరిష్కరించామని తెలిపారు. మిగిలిన వాటిని కూడా పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. గ్రామ సదస్సుల్లో వచ్చిన 11,212 ఫిర్యాదుల్లో 10,748 ఫిర్యాదులు పరిష్కరించామన్నారు. సుమారు 90 శాతం పైబడి ఫిర్యాదులు పరిష్కరించినట్లు తెలిపారు. అర్హులైన వారందరికి పట్టణాల్లో 2 సెంట్లు, పంచాయతీలో 3 సెంట్లు ఇంటి స్థలాలు ఇవ్వడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రభుత్వ స్థలాల ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం మండల రెవెన్యూ కార్యాలయంలో రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సులోచనారాణి పాల్గొన్నారు.

బైరెడ్డిపాలెం గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ

రసవత్తరంగా ఎడ్ల పరుగు ప్రదర్శన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని చిన్నగుడిపాలలో శ్రీపరదేశిమాంబ జాతర ముగింపు సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన ఎడ్ల పరుగు ప్రదర్శన రసవత్తరంగా సాగింది. విజేతలకు మొదటి బహుమతిగా రూ.15వేలు, ద్వితీయానికి రూ.12వేలు, తృతీయానికి రూ.10వేలు నగదు బహుమతులను మాజీ డిసిసిబి చైర్మన్.వి.వి. చినరామునాయుడు, సర్పంచ్ భోజనంకి రామునాయుడు, ఉత్సవ కమిటీ సభ్యులు చేతుల మీదుగా అందించారు. సోమవారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వల్లంపూడి, చిన్నగుడిపాల యువకుల మధ్య స్వల్ప వివాదం చోటు చేసుకోగా వల్లంపూడి పోలీసులు ఇరువురికి సరిచెప్పి పంపించారు.

భీమసింగి కార్మికులకు న్యాయం చేయండి

ప్రజాశక్తి - జామి

భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ కార్మికులు, ఉద్యోగులకు పిఎఫ్, గ్రాట్యుటీ యాజమాన్యం చెల్లించకపోవడంతో కార్మికులు, ఉద్యోగుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని వెంటనే వారికి న్యాయం చేయాలని లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి జెసి, సుగర్ ఫ్యాక్టరీ చైర్మన్ సేదు మాధవన్‌ని కోరారు. యూనియన్ నాయకులతో కలసి మంగళవారం ఆయన జెసిని కలసి వారు పడుతున్న ఇబ్బందులు తెలిపారు. సుమారు 280 మంది కార్మికులు, ఉద్యోగులకు 2020,21 నుండి పిఎఫ్, గ్రాట్యుటీ చెల్లించలేదని, ఫ్యాక్టరీనీ తెరవక, ఉపాధి లేక కార్మికులను పట్టించుకోకుండా వదిలేస్తే ఎలా అని ఆవేదన వ్యక్తం చేశారు. సుగర్ ఫ్యాక్టరీ ఎండీతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని జేసి హామీ ఇచ్చారని భీశెట్టి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చోడాకుల సూర్యనారాయణ, భీశెట్టి ఆధిబాబు, పిన్నింటి కృష్ణ, వర్మ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

భూ ఆధార్ నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి- డెంకాడ

భూ ఆధార్ అనేది ప్రతి ఒక్క రైతు నమోదు చేసుకోవాలని ఎఒ పి.నిర్మల కోరారు. మండల కేంద్రంలో రైతు సేవ కేంద్రం వద్ద భూ ఆధార్ నమోదు కేంద్రాన్ని ఆమె మంగళవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ సాగు చేసినా చేయకపోయినా భూమి ఉన్న రైతు ఆధార్ నమోదు చేసుకోవాలన్నారు. కౌలు రైతులు కూడా నమోదు చేసుకోవచ్చన్నారు. రైతులు ఆధార్ కార్డు, లేటెస్ట్ వన్ బి, బ్యాంక్ పాస్ బుక్, ఆధార్‌లింకు అయిన ఫోన్ నెంబర్ అందు బాటులో ఉంచాలన్నారు. ఇకపై రైతుకు ఏ పథకమైన భూఆధార్ ఉంటేనే వర్తిస్తుందన్నారు.

శృంగవరపుకోట: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న ఎపిస్టేట్ ఫార్మర్ రిజిస్ట్రీ (ఎపిఎఫ్ఆర్) ద్వారా ప్రతి రైతుకు 11 అంకెల ఫార్మర్ ఐడి కేటాయిస్తామని ఎఒ కె.రవీంద్ర తెలిపారు. మంగళవారం పట్టణంలోని మండల వ్యవసాయ కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఈ ఐడి ద్వారా రైతుకు ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలు చేయడానికి, డిజిటల్ సమగ్రీకరణ వ్యవసాయానికి సంబంధించిన అనుదానాలు, పంట రుణాలు, పంట బీమా, పంట కొనుగోలు చేస్తారన్నారు. మోసాలను తగ్గించి, అసలైన రైతులకే కిసాన్ క్రెడిట్ కార్డు బీమా లాంటి సేవలు పొందవచ్చున్నారు.

జాతీయ క్రీడాకారిణికి రూ.10వేలు సాయం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కొండగంగపూడి గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన లక్ష్మీ జాతీయ క్రీడల్లో పాల్గొని విజయం సాధించింది. ఈ మేరకు బానాది ఎంపిటిసి గొంప తులసి ఆమెను ప్రోత్సహిస్తూ రూ.10వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. మరిన్ని క్రీడల్లో పాల్గొని విజయం సాధించాలని మన రాష్ట్రానికి పుట్టిన గ్రామానికి మండలానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కేజీపూడి మాజీ సర్పంచ్ చల్లా వెంకటరావు పాల్గొన్నారు.

నగదు అందిస్తున్న గొంప తులసీ

పశువైద్యశాలలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండల కేంద్రంలోని పశువైద్యశాలలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వైవి రమణ మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పాడి రైతులకు అందుతున్న సేవలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 21వ అఖిలభారత పశు గణన కార్యక్రమాన్ని వేగవంతం చేసి ఈనెల ఆఖరులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. పశునష్టపరిహార పథకం ద్వారా జిల్లాలో 325 మంది రైతులకు రూ.11కోట్లు నష్టపరిహారం అందించామన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా పశుగ్రాసాన్ని 10 నుండి 50 సెంట్లు వరకు పెంచుకోవచ్చని తెలిపారు. మంజూరైన మినీ గోకులాల నిర్మాణ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. రానున్న వేసవిలో పాడి రైతులు పశు సంరక్షణలో తీసుకోవలసిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించాలని పశువైద్యాధికారి కోరాడ గాయత్రికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన

ప్రజాశక్తి-బొబ్బిలి

తడి, పొడి చెత్త సేకరణపై పట్టణ ప్రజలకు మున్సిపల్ వార్డు శానిటేషన్ కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులు అవగాహన కల్పించారు. ప్రతి నెల మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రభుత్వం ఆదేశించినట్లు కమిషనర్ రామలక్ష్మి చెప్పారు. ఇంటి నుంచి వస్తున్న తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వాలని కోరారు. అపార్ట్‌మెంట్‌లో అన్‌సైట్ కంపోస్టింగ్ చేసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

'ఉపాధి'కి నోచుకోని నెల్లిమర్ల

- పేరుకే నియోజకవర్గ కేంద్రం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నెల్లిమర్ల పేరుకే నియోజకవర్గం కేంద్రం గానీ ఉపాధి, అవకాశాలు, అభివృద్ధికి మాత్రం ఆమడ దూరంలో ఉంది. మండలం మొత్తం జనాభా సుమారు 79 వేల మంది ఉండగా వారికి తగ్గట్టుగా ఇక్కడ ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో నెల్లిమర్ల జ్యూట్ మిల్లులో 6వేలకు పైగా ఉపాధి పొందేవారు. 1990 వరకు జిల్లాతో బాటు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ఉపాధి కోసం నెల్లిమర్ల జ్యూట్ మిల్లుకు వచ్చే సందర్భాలు ఉన్నాయి. కాలక్రమేణా జ్యూట్ పరిశ్రమ మారిన టెక్నాలజీతో కనుమరుగై కేవలం 1500 మంది మాత్రమే ఉపాధి పొందుతున్నారు. ఈ ప్రాంతంలో ఒకపక్క కొండలు, గుట్టలు, చంపావతి నది, రైల్వే లైన్ ఆక్రమించడంతో 3500 ఎకరాలు సాగు భూమి మాత్రమే మిగిలింది. ఆ భూమిలో కూడా వర్షా బావ పరిస్థితులు ఏర్పడి కొంత మంది రైతుల భూములు అమ్ముకోవడంతో రియల్ ఎస్టేట్‌లుగా మారాయి. ఈ ప్రాంతంలో ప్రజలు ఉపాధి కోసం జిల్లా కేంద్రంలో భవన నిర్మాణ పనులు, షాపులకు, వందలాది మంది మహిళలు విశాఖ జిల్లా ఆనందపురం రొయ్యల పరిశ్రమలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. కాగా పాలక పార్టీలు నియోజక వర్గ కేంద్రంగా గుర్తించారు గాని ఈ ప్రాంత వాసులకు ఉపాధి మార్గాలు కల్పించ లేకపోయారు. గతంలో టిడిపి, కాంగ్రెస్, వైసిపి కూడా ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించే అంశంపై పట్టించుకోలేదన్న వాదన వినిపిస్తోంది. అయితే ప్రస్తుత నెల్లిమర్ల నియోజక వర్గం గతంలో సతివాడ నియోజక వర్గంగా ఉండేది. ఆ కాలంలో దివంగత మాజీ మంత్రి పెనుమత్స సాంబశివరాజు ఎమ్మెల్యేగా, మంత్రిగా స్థానికంగా నివాసం ఉండి నెల్లిమర్లతో బాటు నియోజకవర్గ పరిధిలోని మండలాల బాగోగులు చూసుకొనే వారు. నెల్లిమర్ల నియోజక వర్గంగా మారిన తరువాత టిడిపి, వైసిపి నాయకులు ఏదో మొక్కుబడిగా నెల్లిమర్ల వచ్చి వెళ్తున్నారు గాని నియోజక వర్గం కేంద్రాన్ని పట్టించుకున్న పాపాన పోలేదని మండల వసూలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలక పార్టీలో నియోజక వర్గం కేంద్రాన్ని పట్టించుకోని అభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతున్నారు.

మూతబడిన నెల్లిమర్ల జ్యూట్‌మిల్లు

తిల్కా మంజా ఆదర్శవంతుడు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

బాబా తిల్కామంజి భారతదేశ మొట్టమొదటి స్వాతంత్ర సమరయోధుడని, ఇతరలకు ఆదర్శవంతుడని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివాసి విప్లవ వీరుడు, మొట్టమొదటి స్వతంత్ర సమర యోధుడు, బాబా తిల్కామంజి 276వ జయంతి ఉత్సవాలను చరిత్ర శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యం, ఈస్ట్ ఇండియా కంపెనీ వలసపాలనపై, వారి దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా తిరుగుబాటు జెండాను ఎగరవేసిన ఆదివాసి విప్లవ యోధుడు బాబా తిల్కమాంజి అని కొనియాడారు. 1857 సిపాయి తిరుగుబాటు ప్రథమ స్వతంత్ర సమరానికి 70 ఏళ్ల ముందే తెల్ల దొరల సామ్రాజ్య వాదనపై తిరుగుబాటు లేవదీసి, స్వతంత్ర పోరాటాలకు మార్గదర్శిని, స్ఫూర్తిని, అందించిన భారత ఆదివాసి యోధుడు బాబా తిల్కా మాంజీ అని గుర్తు చేశారు. అటువంటి వ్యక్తిని యువకులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చరిత్ర ఉపన్యాసకులు చాలా శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ కె.వాసుదేవరావు, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ వి సుధీర్, డాక్టర్ ఆర్ శ్రీలక్ష్మి, డాక్టర్ జి ఈరన్న, ఎన్ఎస్ఎస్‌పిఒ పి భాస్కర్, విద్యార్థులు పాల్గొన్నారు.